వరాల తల్లికి వైభవంగా పూజలు


విశేష అలంకారంలో శ్రీ భువనేశ్వరీమాత


విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కడప కల్చరల్ : వరాలిచ్చే దేవత వరలక్ష్మి మాతకు భక్తులు మనసారా పూజలు చేశారు. శ్రావణ మాసం రెండవ శుక్రవారం సందర్భంగా వరాల తల్లి శ్రీ వరలక్ష్మిదేవికి ఇళ్లల్లోనూ, ఆలయాల్లోనూ మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో ఉదయం, మరికొన్నింటిలో సాయంత్రం అమ్మవారి వ్రతం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. స్థానిక భక్తులు విశేష సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు.

– కడప నగరంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో మహిళా మండలి ఆధ్వర్యంలో వరలక్ష్మిమాత వ్రతం నిర్వహించారు.

కనుల పండువగా ..

శ్రీ వరలక్ష్మిమాత మూర్తులను ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక శ్రద్ధతో అలంకరించారు. కలశంపై అమ్మవారి ముఖ మూర్తిని ఏర్పాటు చేసి కలశంతో పాటు దాని చుట్టూ సువర్ణ ఆభరణాలను కనుల పండువగా తీర్చిదిద్దారు. అనంతరం అమ్మవారి పసుపు కుంకుమలను ప్రసాదంగా అందజేశారు. అమ్మవారి వ్రతాన్ని పలువురు భక్తులు తమ ఇళ్లలో కూడా నిర్వహించారు. పురోహితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇరుగు పొరుగు మహిళలు హాజరై పూజలు చేశారు. నిర్వాహకులు ప్రత్యేక ప్రసాదంగా గాజులు, పూజలో ఉంచిన జాకెట్ వస్త్రాలను హాజరైన మహిళలకు అందజేశారు.

మార్కెట్లలో కళ ...

మార్కెట్లలో వరలక్ష్మి వ్రతం కళ కనిపించింది. ముఖ్యంగా బంగారం దుకాణాలు, వస్త్ర దుకాణాలను అరటి పిలకలు, మామిడాకుల తోరణాలతో అలంకరించారు. దుకాణాల్లో పూజలు నిర్వహించి చుట్టుపక్కల వారికి, వచ్చిన కొనుగోలు దారులకు ప్రసాదాలను అందజేశారు.

– కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవిని శుక్రవారం వరలక్ష్మిదేవిగా అలంకరించారు. వరలక్ష్మివ్రతం సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజామున అర్చక బృందం విశేష అభిషేకాలు నిర్వహించింది. అనంతరం మూలమూర్తిని కనుల పండువగా అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వ్రతంలో పాల్గొనేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చారు. అర్చకులు వ్రత విధానాన్ని తెలియజేస్తూ కార్యక్రమాలను ఆచరింపజేశారు. ఉదయం 10.30 గంటల నుంచి వ్రతానికి ముందుగా మహిళలచే నిర్వాహకులు సుమంగళి పూజ నిర్వహింపజేశారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహింపజేశారు.

– కడప నగరంలోని పెద్దబెస్తవీధిలోగల నడివీధి గంగమ్మ క్షేత్రంలో శుక్రవారం అమ్మవారికి వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. శ్రావణమాసం రెండవ శుక్రవారం అమ్మవారి ఆలయాలలో ఇలా వరలక్ష్మి వ్రతం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఇందులో భాగంగా నిర్వాహకులు గోపాల్‌సింగ్ దంపతులు, క్షేత్ర కమిటీ మహిళా సభ్యులు అమ్మవారికి విశేష అలంకారం చేశారు. స్థానిక మహిళలతోపాటు సమీప ప్రాంతాల మహిళా భక్తులుకూడా విశేష సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. అర్చకుల ఆధ్వర్యంలో పూజా, వ్రత విధానాలను వివరిస్తూ కార్యక్రమాన్ని పూర్తి చేయించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


శ్రీ వరలక్ష్మిమాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

– స్థానిక భువనేశ్వరిమాత ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం జరిగే వరలక్ష్మివ్రతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకారంచేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం


మాసాపేటలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

కడప రూరల్ : పరిశుభ్రతా చర్యలు చేపట్టడం ద్వారానే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక మాసాపేటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రోగామును డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. అనంతరం ఆయన డ్రై డే ప్రాముఖ్యతను వివరించారు. వారానికి ఒకసారి తమ నివాసాల్లోని కుండలు, బానలు, తొట్లు తదితర నీటిని నిల్వ చేసుకునే వాటిని శుభ్రపరుచుకోవాలన్నారు. చేతులు శుభ్రపరుచుకున్న తర్వాతనే ఆహారం తీసుకోవాలన్నారు. మురికి కాలువల్లో నీరు నిల్వ లేకుండా శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయిల్ బాల్స్‌ను నీటిలో వదిలారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, ఏఎస్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

చర్చి ఆస్తులు కాపాడుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న డేనియల్ ప్రదీప్‌కుమార్

కడప రూరల్: చర్చి ఆస్తులను కాపాడుకుందాం అని వక్తలు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో జమ్మలమడుగు కాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్ అధ్యక్షతన సీఎస్ఐ ఐటీపీ ఆస్తులపై అవగాహన సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ మాజీ డైరెక్టర్ డేనియల్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ చర్చి ఆస్తుల పరిరక్షణకు తన మద్దతు ఉంటుందని తెలిపారు. పాస్టర్ ఐక్యతారావు, ప్రజా సంఘాల జేఏసీ నేతలు కారు ఆంజనేయులు, అవ్వారు మల్లిఖార్జున, జేవీ రమణ మాట్లాడుతూ విలువైన చర్చి ఆస్తుల పరిరక్షణకు కలిసికట్టుగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పీరా, ప్రతాప్‌రెడ్డి, కై పు రామాంజనేయులు, ప్రభాకర్, శ్రీక్రిష్ణదేవరాయలు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమ్మేళనాలు జయప్రదం చేయాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న విధానాల పైన చర్చించేందుకు విశాఖపట్నంలో నిర్వహించే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్.మహబూబ్ బాష కోరారు. శుక్రవారం స్థానిక కడప రైల్వే స్టేషన్‌లోని గూడ్స్ షెడ్ హమాలీ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దేశసంపదలోని రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, బొగ్గు గనులను కారు చౌకగా అప్పజెబుతున్నారని విమర్శించారు. ఈ క్రమంలో సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో విశాఖలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల్లో దేశవ్యాప్త కార్మిక సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణని రూపొందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ యూనియన్ నాయకులు పాల్, చిన్న ఓబులేసు, నాగేంద్ర, గంగయ్య, సూరి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది


ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరు

వీరపునాయునిపల్లె : స్థానిక ఆర్అండ్ఆర్ కాలనీలో తాగునీటి సౌకర్యం ఏర్పాటుకు దాతలు అందించిన సహకారం మరువలేనిదని పంచాయతీ కార్యదర్శి నాగభూషణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ కాలనీలో తాగు నీటి సమస్య ఉండటంతో కాలనీ వాసులు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆయన పిచ్చిరెడ్డి ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో షాజిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో బోరు వేయించారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి


బస్సుల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ మురళీకృష్ణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప డిపోలో అశోక్‌లైల్యాండ్ ఆధ్వర్యంలో అత్యాధునిక టెక్నాలజీ బీఎస్–6 బస్సులపై డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరు పి.లక్ష్మిభాస్కర్ తెలిపారు. గురువారం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో డిపో మేనేజర్ ఢిల్లీశ్వర్‌రావు, అశోక్‌లైల్యాండ్ ట్రైనర్ కె.మురళీకృష్ణతో కలిసి శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక వాహనాలను సంస్థ కొనుగోలు చేసిందన్నారు. డ్రైవర్‌కు డ్రైవింగ్‌లో సులభతరంగా ఉండే విధంగా అత్యాధునిక టెక్నాలజీ బస్సులను కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రతి డ్రైవర్ వీటిపై కచ్చితంగా అవగాహన పెంచుకోవాలన్నారు. డిపో మేనేజర్ ఢిల్లీశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ కొత్త టెక్నాలజీ తెలుసుకుని దాన్ని అందిపుచ్చుకుని డ్రైవింగ్ చేయాలన్నారు. అనంతరం ట్రైనర్ మురళీకృష్ణ బస్సు టెక్నాలజీ గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

ఫ్రిడ్జ్ వితరణ



అనాథ శరణాలయానికి ఫ్రిడ్జ్ వితరణగా అందజేస్తున్న బ్యాంకు అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని సాయిబాబా అనాథ శరణాలయానికి గురువారం ఫ్రిడ్జ్ వితరణగా అందించినట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు డీజీఎం అభిజిత్ సింహా అన్నారు. ఆయన గురువారం కడప నగరానికి వచ్చిన సందర్భంగా సీఎస్ఆర్ పథకం ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్ జీఎస్ రావు, రుణ వితరణ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, బ్యాంకు కరస్పాండెంట్ విజయ నరసింహులు, అనాథ శరణాలయ చైర్మన్ రామ్మూర్తి, కార్యాలయ అధికారి బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విద్వేష రాజకీయాలను ప్రతిఘటిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీజేపీ విద్వేష, మత, కుల రాజకీయాలను, కార్పొరేట్ అజెండాను నిలువరించేందుకు సైద్ధాంతిక నిరంతర పోరాటాలను ఉధృతం చేయాలని, జిల్లా సమగ్ర అభివృద్ధికి ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో బీజేపీ విఫలమైందని, అయినా దేశంలో బీజేపీ ప్రభుత్వం దుందుడుకుగా ప్రజాస్వామ్యరహితంగా పనిచేయడం కొనసాగిస్తోందన్నారు. వామపక్ష, ప్రజాస్వామ్య పార్టీలను మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని బీజేపీ ఆర్ఎస్ఎస్ పనిచేస్తున్నదన్నారు. మన దేశ సెక్యులర్, ప్రజాస్వామ్య వ్యవస్థను ,రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు నిరంతర పోరాటాలు కొనసాగించాలన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలులో భాగంగా కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి చంద్రబాబు ప్రభుత్వం దోహదపడే విధంగా సీపీఐ తగు ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి. రామయ్య, ఎల్. నాగ సుబ్బారెడ్డి, వీరశేఖర్, సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ, సీపీఐ నగర సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, మద్దిలేటి, నగర కార్యవర్గ సభ్యులు జి. వేణుగోపాల్, నాగరాజు, బ్రహ్మం, మల్లికార్జున, లింగన్న, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణేల వినియోగంపై అవగాహన


రూ.10 నాణేలను అందజేస్తున్న కెనరా బ్యాంకు ఆర్ఎం మురళీమోహన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రూ. 10 నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ తెలిపారు. గురువారం నగరంలోని ఏడురోడ్ల కూడలిలో కెనరా బ్యాంకు ఎదుట రూ. 10 నాణేల చలామణిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ శివ శంకర్ సూచన మేరకు ఈ నాణేలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రూ. 10 నాణెం చెల్లుబాటు అవుతుందని ఆర్‌బీఐ ప్రకటించిందన్నారు. ఈ నాణెం చెల్లదంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మరాదని ఆయన సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్దనమ్ మాట్లాడుతూ రూ.10 నాణేలు చెల్లుబాటు అవుతున్నాయని, వాటిని విరివిరిగా వాడాలన్నారు. రూ. 10 నాణేలను అన్నిరకాల లావాదేవీల్లోనూ ఉపయోగించవచ్చన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల వ్యాపారులు దాదాపు రూ. లక్ష విలువజేసే రూ.10 నాణేలను తమవ్యాపార నిమిత్తం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ డివిజన్ మేనేజర్ రమేష్, మెయిన్ బ్రాంచ్ మేనేజర్ మధుకర్, మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలుర గృహం సందర్శించిన జడ్జి


ప్రభుత్వ బాలుర గృహంలో పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ బాలుర గృహంను సందర్శించారు. పిల్లలు ఏయే తరగతులను అభ్యసిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, వంటశాలను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015ను వివరించారు. విద్య విలువైనదనీ, క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగిన జాగ్రత్తలు వహించాలని వసతి గృహ సిబ్బందిని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకుని రావాలన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి సమస్యలు విన్నవించిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక పరిషత్ జోనల్ కార్యదర్శి పురుషోత్తం కోరారు. గురువారం సాయంత్రం నగరానికి వచ్చిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులు మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉద్యోగుల సమస్యల పట్ల స్పందిస్తూ ఈనెల 21వ తేదిన ఆర్టీసీ అధికారులతో సమీక్ష ఉన్నదని, ఆ తర్వాత పూర్తి స్థాయిలో సమస్యల పట్ల దృష్టి సారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సిద్దయ్య, సుబ్బరాయుడు, రాజేంద్రారెడ్డి, ఖాజాపీర్, లూర్దరాజు, సీవీ రమణ, అన్నయ్య, మల్లికార్జున, శివ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందించాలి

కడప స్పోర్ట్స్: క్రీడల అభివృద్ధి కోసం ప్రతి పాఠశాలకు క్రీడాసామగ్రిని అందజేయాలని ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం కడప నగరంలోని ఆర్‌టీసీ అతిథిగృహంలో రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడామంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డిని కలిసి విన్నవించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలకు క్రీడాసామగ్రిని పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో అనంతపురం బాధ్యు లు నరసింహారెడ్డి, అన్నమయ్య జిల్లా బాధ్యు లు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పొలతలలో వరలక్ష్మి వ్రతం


పొలతలలో వరలక్ష్మి వ్రతానికి హాజరైన మహిళా భక్తులు

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో ఆలయ ఈఓ శ్రీనువాసులు సమక్ష్యంలో ఘనంగా వరలక్ష్మి వ్రతం వేడుకలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వెయ్యినూతలకోన క్షేత్రంలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా లక్ష్మినరసింహస్వామి, లక్ష్మిదేవి అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయంలో సందడి వాతావరణం కనిపించింది. శనివారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త పి.నరసింహ హరిప్రసాద్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో రైతుల బెంబేలు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు నిత్యం చోరీకి గురవుతున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని మండల రైతులు వాపోతున్నారు. ఇటీవల శేషయ్యగారిపల్లి, ఖాదర్‌ఖాన్ కొట్టాలు, గోపవరం తదితర ప్రాంతాల్లో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు, రెండు సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ముగ్గురు రైతుల పాత ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. ఖాదర్‌ఖాన్ కొట్టాల దగ్గర సమీప చెరువులో ట్రాన్స్‌ఫార్మర్ పడేసి ఆయిల్ కింద పోసి కాపర్ వైర్‌ను దొంగలించారు.

ఆయా విషయాలపై ఏఈ రామలింగారెడ్డిని వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్న మాట వాస్తవమేనని, రాత్రి వేళల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్టు అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం అందిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారన్నారు.

శ్రీశైలం నీటిని జిల్లాలోని ప్రాజెక్టుల్లో నింపాలి

ఎర్రగుంట్ల : శ్రీశైలం జలాశయంలోని నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా జిల్లాలోని ప్రాజెక్టులలో పూర్తి సామర్థ్యంతో నింపాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టులన్నీ పూర్తిగా అడుగంటిపోయాయన్నారు. శ్రీశైలం డ్యాం, నాగర్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలన్నీ నిండుకుండలా మారి లక్షల క్యూసెక్కులు నీరు సముద్రం పాలవుతోందన్నారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు నీళ్లు లేక వెలవెల పోతున్నాయన్నారు.

విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: వయనాడ్ వరదలను జాతీయ విపత్తుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వయనాడ్ బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలోని వాయనాడ్ ప్రాంతాన్ని ప్రధానమంత్రి మోదీ పరిశీలించారని.. అయితే ఇంతవరకు ఆర్థిక సాయం ప్రకటించకపోవడం విడ్డూరమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుదర్శన్ రెడ్డి, రీజినల్ ప్రెసిడెంట్ ఎన్. శివ శంకర్ , విద్యుత్ జిల్లా నాయకులు కే. సురేంద్రబాబు , ఎస్ గంగన్న , నందీశ్వర్ రెడ్డి, బి. శివ ప్రసాద్ రెడ్డి, చంద్రమౌళి, శ్రీనివాసులు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం


ఆర్డీ శ్రీనివాసులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

కడప రూరల్: ఏపీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వై శ్రీనివాసులును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానం చేశారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎవరైనా బోగస్ ఎస్టీ సర్టిఫికెట్స్‌ను సమర్పిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వై శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీ. చంద్రశేఖర్, ఎస్. గంగాధర్, కే. లక్షుమయ్య, కే. సుంకన్న, ఎస్. వెంకటసుబ్బయ్య, ప్రమీల, గందాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఆర్థికసాయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంతర్జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రీడాకారుడు శ్రీకాంత్‌కు దాతలు అండగా నిలిచారు. ఈ మేరకు శ్రీకాంత్‌కు ఇమ్మర్స్ సంస్థ సహకారంతో గురువారం నగరానికి చెందిన కేతి ప్రకాశ్, ఎలీసా, రాంబాబులు రూ. 5 వేల విలువైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సీహెచ్ జాన్, సుభాషిణి పాల్గొన్నారు.

నూతన నియామకం


హేమమాలినిరెడ్డికి నియామకపత్రాన్ని ఇస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి రామకృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా ఓసీ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా హేమమాలిని నియమితులయ్యారు. కడపలోని ఓసీ సంఘం కార్యాలయంలో సభ్యులు సమావేశాన్ని నిర్వహించి ఓసీ సంఘం మహిళా విభాగం కడప జిల్లా అధ్యక్షురాలుగా పూలకుంట హేమమాలిని రెడ్డిని ఓసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి ఎంపిక చేశారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఏపీ ఓసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓసీ సంఘ నేతలు ఏమిరెడ్డి రామకృష్ణారెడ్డి, చిన్న ఆవుల చంద్రశేఖర్ రెడ్డి, రాజోలి రాజారెడ్డి, నక్క వెంకటసుబ్బారెడ్డి, గుమ్మా రవీంద్రారెడ్డి ,ఆవుల శంకర్ రెడ్డి, ఉద్యోగ విభాగం నాయకులు రామసుబ్బారెడ్డి, రఘురాం, సూర్య ప్రకాశ్ రెడ్డి ,మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలలో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్: స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో దువ్వూరు మండలం మాచనపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటి జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచారు. ఈ మేరకు కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా విద్యార్థులు సంజనారెడ్డి, హేమలత, కావ్యశ్రీలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. హెచ్ఎం చంద్రశేఖర్, గైడ్ టీచర్ వెంకటసుబ్బయ్యతోపాటు ఉపాధ్యాయ బృందాన్ని కలెక్టర్ అభినందించారు.